విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 17 జులై 2025 8 పేజీలు

విమర్శలతో సరి...?

- ప్రతిపక్షం పైనే అధికార పార్టీ గురి
- ఏడాది పూర్తయినా వైసీపీ బాటలో పాలకపక్షం

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది.రెండో ఏడాదిలోకి అడుగుపెట్టారు. ఇంకా వైసీపీ పాలనపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసం మయ్యాయని, అన్ని రకాలుగా రాష్ట్రాన్ని దివాళా తీయించారని పదేపదే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు ఇంటింటికీ తిరుగు తున్నారు.'సుపరిపాలనలో తొలి అడుగు'పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగుతున్నారు.ఏడాదిలో ఏం చేసామనే అంశాలతో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమం ముగిసేలోపు ఎక్కడో ఒకచోట మీడియా ప్రతినిధులను కలిసి మైకులు పెడుతున్నారు. అక్కడ మంత్రులు మొదలు ఎమ్మెల్యేలు అందరూ నేటికి ▶మిగతా 2లో..

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం

సీపీఐ కాకినాడ జిల్లా మహాసభల ప్రారంభంలో డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం ద్వారా పార్టీ నిర్మాణాన్ని పెంచుకోవచ్చని తద్వారా ప్రజల పార్టీగా సీపీఐ

బహిరంగసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యురాలు పి. దుర్గాభవాని

రూపొందుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం సామర్లకోటలోని రైతు భవన్లో పోతుల బాపిరాజు హాల్లో సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. అధ్యక్ష వర్గంగా తోకల ప్రసాద్, ఎ. భవాని, మడగల రమణ వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని పెదిరెట్ల సత్యనారాయణ ప్రవేశపెట్టగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ముందుగా డేగా ప్రభాకర్ ▶మిగతా 2లో..

పేదరికం లేని సమాజ నిర్మాణమే పీ4 ప్రధాన ఉద్దేశ్యం

- మంత్రి నాదెండ్ల మనోహర్

-జిల్లాలో 95 వేల బంగారు కుటుంబాల గుర్తింపు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికంలేని సమాజాన్ని నిర్మించాలన్నదే పీ4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ▶మిగతా 4లో..

ఉపాధి, ఉద్యోగాలే లక్ష్యంగా విద్యా బోధన

- మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి
- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటన
- అంబేద్కర్ గురుకులాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - అమలాపురం : పేదల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ▶మిగతా 2లో..

మహాసభల విజయవంతానికి సహకరించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి
కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: ఆగష్టు 19, 20 తేదీల్లో తణుకులో జరుగనున్న సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలు విజయవంతానికి విరివిగా విరాళాలిచ్చి అందరూ సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. బుధవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్లో పార్టీ జిల్లా మహాసభల కరపత్రాన్ని పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా ఆగస్టు 19 న తణుకులో భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగసభ నిర్వహిస్తున్నా మన్నారు. మహాసభ లకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు తదితరులు హాజరవుతున్నారన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆవిర్భవించిన సీపీఐ దేశ స్వాతంత్ర సాధనకు ఎనలేని త్యాగాలు, పోరాటాలు నిర్వహించింద న్నారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో పేదరికం దోపిడీ, కుల, మత భేదాలు లేని సమసమాజ నిర్మాణం లక్ష్యంగా వందేళ్ళుగా నిర్విరామంగా ఉద్యమిస్తుంద న్నారు. కార్మికులు, రైతాంగం, విద్యార్థి, యువజన, మహిళా సమస్యల పరిష్కారానికి, శ్రమ జీవుల అభ్యున్నతికి అలుపెరుగని ▶మిగతా 2లో..

శిశు జనన రేటు పెరగాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ప్రపంచ జనాభా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం దంపతులు ఒక బిడ్డతో సరిపెట్టుకుంటున్నారని దానివల్ల భవిష్యత్తులో యువ జనాభా తగ్గిపోతుందన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా జనాభా పెరుగుదల అవసరతను ప్రస్తావిస్తున్నారని ▶మిగతా 4లో..

పిట్టా నారాయణరావు మృతి వామపక్షాలకు తీరనిలోటు

విశాలాంధ్ర-పెంటపాడు : మండలంలోని అల్లంపురం గ్రామానికి చెందిన పిట్టా నారాయణరావు మృతి వామపక్షాలకు తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. నారాయణరావు ప్రత్తిపాడు ఎఫ్ఎఫ్ఎఫ్ ఆయిల్ కర్మాగారంలో కార్మికునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగంలో ఉంటూ సీపీఐ కార్యకర్తగా,ఏఐటీయూసీ సభ్యునిగా పనిచేశారు. మంగళవారం రాత్రి ఆయన స్వగృహంలో గుండెపోటుతో మరణించారు. బుధవారం సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు...నారాయణరావు భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పారు. అనంతరం ఆయన మృతి పట్ల సంతాపాన్ని తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దిద్దే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్ ఎంపిక జరిగింది. సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ గా శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక కళాశాల తణుకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ఈ. జ్యోతి కిరణ్మయి బుధవారం ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు ఇచ్చిన డెమోను,విద్యార్హతలను పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారం ఎ. శాంతిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. జ్యోతి కిరణ్మయి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గెస్ట్ లెక్చర్‌లో పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మీద అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపల్ జ్యోతి కిరణ్మయిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.స్వరూప రాణి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యక్షుడు కె. గిరిబాబు, పివి రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా బోధన (1వ పేజీ తరువాయి)

మంత్రి పర్యటించారు. అల్లవరం మండలం గోడి గ్రామంలోని అంబేద్కర్ బాలికల గురుకులంలో రూ. 20 లక్షలతో అంబేద్కర్ విగ్రహ నిర్మాణం, బాస్కెట్ బాల్ కోర్టు, రూ.15 లక్షలతో ప్లే గ్రౌండ్ నిర్మాణానికి, బాలుర గురుకులంలో రూ.24 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, రూ.15 లక్షలతో ప్లే గ్రౌండ్ నిర్మాణానికి మంత్రి , స్థానిక ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం విద్యార్థినిలు, విద్యార్థులతో విడివిడిగా ముఖాముఖి నిర్వహించి పాఠశాలలో అందుకున్న సౌకర్యాలు, సమస్యలు, టీచర్ల బోధనా తీరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగాలే లక్ష్యంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నామన్నారు. గురుకులాలు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 10కి పెంచామని తెలిపారు. గురుకులాల్లో ఐఐటీ, నీట్‌లో త్రుటిలో అర్హత కోల్పోయిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ బాలుర పాఠశాలలో తమకు తరగతి గదులు సరిపోవడం లేదని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో అవసరమైన అదనపు తరగతి గదులు వెంటనే మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం నల్లమిల్లి గ్రామంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుతో కలసి మంత్రి స్వామి రూ.15 లక్షలతో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో పరిపాలన భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సహకరించండి
(1వ పేజీ తరువాయి)

పోరాటాలు నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం జరిగిన పోరాటాల్లో ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. దేశంలో మరే పార్టీకి ప్రజల కోసం ప్రాణాలర్పించిన చరిత్ర లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం పనిచేస్తున్న సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతానికి అందరూ తమ సహాయ సహకారాలందించాలని భీమారావు కోరారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ సమితి సభ్యులు గార ప్రసాద్,గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళీ, బొద్దాని కృష్ణకిషోర్, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలతో సరి
(1వ పేజీ తరువాయి)

వైసీపీపైనే విమర్శలు గుప్పిస్తున్నారు.

పాలనపై స్పష్టత కరువు

ఏడాదిలో ఏం చేశామనే అంశం ప్రాధాన్యత లేకుండా పోతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐదేళ్ల వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచితే బాదుడే బాదుడు అంటూ ఊరూ వాడా ప్రచారం నిర్వహించారు. అప్పట్లో ప్రతిపక్షంగా ఆ పాత్ర సహజమే..కానీ నేడు అధికారం చేపట్టిన తర్వాత ఇంకనూ అదే బాటలో కొనసాగుతున్నారు. ఏడాది పాలన ముగిసింది.రెండో ఏడాదిలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు కూడా వైసీపీపై విమర్శలు చేస్తే ఉపయోగం ఏమైనా ఉందా...? అనేది పాలకపక్షం ఆలోచించడం లేదు. రాజకీయంగా పార్టీల మధ్య విమర్శలు,ప్రజా సమస్యలపైనే జరగాలి. ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు ఎంత మేరకు చేసామన్నది ఆలోచించాలి. ప్రజలకు ఇప్పుడు ఏం చెప్పాలో స్పష్టత లేకనే వైసీపీపై విమర్శలు చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

తల్లికి వందనంతో కూటమికి ఊపిరి

వాస్తవంగా ఆలోచిస్తే వైసీపీ పాలన బాగాలేదనే భావనతోనే ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారు. ఈ విషయం పాలక పక్ష నేతలకు తెలియదా..? అంటే ఆలోచించాలి.. ఏడాదిలో ఇచ్చిన హామీలు అమలు మొన్నటి వరకు ప్రశ్నార్థకంగానే మారింది.గ్యాస్ సిలిండర్ల పథకం గత దీపావళి నుంచి ఆచరణలోకి వచ్చింది. దాన్నుంచి ప్రభుత్వానికి పెద్దగా స్పందన రాలేదు.గత నెలలో తల్లికి వందనం పథకం అమలు చేశారు. పాలకపక్ష నేతలకు ఊపిరి పీల్చుకునేలా చేసింది.ఇది కూడా లేకుంటే ఇంటింటికి తిరిగి ఏం చెప్పాలో కూడా అంతు చిక్కని వ్యవహారమే. ఇంకా రైతులకు పెట్టుబడిసాయం, ప్రతి మహిళకూ రూ.1500, నిరుద్యోగ భృతి వంటివి ఆచరణలో కనిపించలేదు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం ఆగస్టు 15 నుంచి అని ప్రకటించారు. ఈ హామీలు అమలుపై జనంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

జిల్లా హామీలు ఎండమావులేనా...?

ఇక జిల్లా హామీలు ఎండమావులుగానే మారాయి. పోలవరం ప్రాజెక్ట్ 2027 నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. హామీ అమలు కోసం వేచి చూడాల్సిందే. అప్పటికైనా పూర్తిస్థాయిలో అవుతుందా లేదా అనేది స్పష్టత లేదు. పాలకపక్ష ఎమ్మెల్యేలలోనే నమ్మకం కనిపించడం లేదు.బడ్జెట్లో నిధులు కేటాయింపులు చూస్తే ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందనేది సందేహంగా మారింది.నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం,ఎప్పుడు ఇస్తారో తెలియదు. పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే ఉన్నాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకం వాగ్దానాలకే పరిమితమైంది. ఏలూరు జిల్లాలో మెగా ఏరోసిటీ పరిశ్రమ కథ కంచికే అన్న చందంగా మిగిలింది. టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి అప్పగించడం, గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు వంటివి ఎప్పటికి అమలవుతాయో ప్రశ్నార్థకంగా మారింది. ఇవన్నీ వదిలేసి నిత్యం మంత్రులు, శాసనసభ్యులు వైసిపి పాలన పైనే విమర్శలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారంలో ఉన్నందున గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేయాలి. దీంతోపాటుగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడానికి ప్రయత్నం చేయాలి. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలి.జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు తేవాలి. వెనుకబాటుకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలి.

కేంద్రంలో టీడీపీ పై ఆధారపడి బీజేపీ పాలన సాగిస్తుందని దీన్ని అవకాశం గా మలుచుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కేంద్రం ఇచ్చే అప్పులు కాకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలి. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని గుర్తించాలి. లేదంటే చరిత్ర పునరావృతం కాక తప్పదు.

పార్టీ బలోపేతం
(1వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఒకప్పుడు పార్లమెంటులో కమ్యూనిస్టుల బలం ఉండేదన్నారు. కార్మిక హక్కుల కోసం ప్రధానంగా ప్రజలహక్కుల పార్లమెంటు బయట లోపల ఉద్యమాలు చేశామని పేర్కొన్నారు. నేడు పార్లమెంట్లో వామపక్షాల బలం తగ్గడం వల్ల బూర్జువా రాజకీయ నాయకులు కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యురాలు పి.దుర్గా భవాని మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీలు ఏవైనా ఉన్నాయి అంటే కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలే అన్నారు. నేడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని పార్టీలు అధికారంలో ఉన్నాయని దేశభక్తి గురించి ఈ పార్టీలు మాట్లాడుతున్నాయని ఆమె విమర్శించారు. రాజకీయాల్లోకి మహిళలు ముందుకు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పలు తీర్మానాలను సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు తాటిపాక మధు ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మధు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని ఉద్యమం చేపడతామన్నారు. స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కేజీ బేసిన్ 50% ఏపీకి వాటా దక్కాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సీపీఐ జిల్లా కార్యదర్శిగా కే బోడకొండ, సహాయ కార్యదర్శిగా తోకల ప్రసాద్ ఎన్నికయ్యారు. 23 మంది సభ్యులతో జిల్లా నూతన సమితి ఎన్నికైంది.

మధ్యవర్తిత్వంలో గోప్యత పాటించాలి

విశాలాంధ్ర -భీమవరం: మధ్యవర్తిత్వం చేసేటప్పుడు కేసు రాజీ పడినా, రాజీ పడకపోయినా గోప్యత పాటించాలని, రాజీ పడితే రాజీ షరతులు నమోదు చేయాలని 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో మధ్య వర్తిత్వం ద్వారానే కేసులు ఎక్కువగా పరిష్కారం అవుతాయని మధ్యవర్తిత్వం పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు స్టీఫెన్ బాబు, హరి, విజయలక్ష్మీ, ప్యానల్ న్యాయవాదులు సురేష్ కుమార్, అంబేద్కర్, సుధీర్, జ్యోతి, భవాని, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపం లేకుండా చర్యలు

విశాలాంధ్ర - నరసాపురం: పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని 7వ వార్డులో బుధ వారం పర్యటించి పారిశుధ్య పనులు, డ్రైన్ పూడికతీత పనులను పరిశీలించారు. వార్డులో దట్టంగా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. నీటిసరఫరా పైపులను లీకులు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, సచివాలయ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల మాజీ ఉపాధ్యక్షుడు మృతి

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం మండల మాజీ ఉపాధ్యక్షుడు గుత్తుల బలి చక్రవర్తి (73) మంగళ వారం రాత్రి గుండెపోటుతో నరసాపురంలో మృతి చెందారు. మృత దేహాన్ని ప్రజల సందర్శనార్థం స్వగ్రామం తూర్పుతాళ్ళు తరలించారు. ఆయన రెండు పర్యాయాలు ఎంపీటీసీ సభ్యునిగా, పీఏం లంక సొసైటి డైరెక్టర్‌గా మూడు సార్లు పనిచేశారు.ఆయనకు భార్య సత్యవతి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకీరామ్, చెన్నాప్రగడ పాండు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ శ్రీ ఫీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు 33/11కె వి టి నరసాపురం, సబ్ స్టేషన్ పరిధిలోని రుద్ర కోట రాజు గూడెంలో ఆర్ డి ఎస్ ఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ అంతరాయానికి సహక రించాలని ఆయన కోరారు.

అక్రమ మట్టి తవ్వకాలు జరిపినా, అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నా చర్యలు

- ఎమ్మెల్యే హెచ్చరిక
- అక్రమాలు జరగకుండా అధికారులతో సమీక్ష
- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-లింగపాలెం: ఏలూరు-చింతలపూడి ప్రధాన రహదారి దుస్థితి, అధిక లోడుతో వాహనాలను నడపడంపై రెండు రోజుల నుంచి విశాలాంధ్రలో ప్రచురించిన కథనాలపై చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, వివిధ శాఖల అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రవాణా శాఖ ఇంచార్జ్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారావు,వాహనాల తనిఖీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పరిమితికి మించి లోడుతో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలు ఉల్లంఘించి అధికలోడుతో వాహనాలు తిరగటం వల్ల రహదారులు మరమ్మత్తుకు గురవ్వ టమే కాక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వీటిని నివారించే బాధ్యతను బాధ్యతగా తీసుకోవా లని ఎమ్మెల్యే కోరారు.ఎమ్మెల్యే ఆదేశాలను,సూచనలను అమలు చేస్తామని ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టా లని ఇరిగేషన్, రెవెన్యూ,పోలీసు సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు.నిబంధనలకు విరుద్ధంగా,అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయాలపై ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతుంది.

మండల విద్యాశాఖ అధికారి వన్‌ను నియమించండి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి :మండలంలో ఎంఈఓ వన్ కే.సర్వేశ్వరరావు గత నెలలో పదవి విరమణ పొందగా ఇంతవరకు ఆ స్థానంలో ఎంఈఓ1ను నియమించలేదని ఎస్.టి.యు మండల అధ్యక్షులు మక్కే వేణుగోపాల రావు, జిల్లా అధ్యక్షులైన ఎం. శామ్యూల్‌కు మండల శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి 1 లేకపోవడం వలన నూతనంగా చేరిన ఉపాధ్యాయుల అరియర్ బిల్లులు,రెగ్యులర్ బిల్లులు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు.జిల్లా అధ్యక్షులు ఎం.శామ్యూల్ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మను సంప్రదించగా అర్జెంటిగా మాట్లాడి ఎంఈఓ వన్‌ను నియమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్.టి.యు. నాయకులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

విశాలాంధ్ర-కాళ్ళ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా వారికి అమలు చేయవలసిన ఓ పి ఎస్ ను వెంటనే అమలు చేయాలని ఎస్టియు పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి పెనుమత్స సాయి వర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాలు మారినా ఎప్పటి కప్పుడు 2003 డిఎస్‌సి ఉపాధ్యాయు లకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేసే నిమిత్తం వివరాలు తీసుకోవడమే గాని కార్యరూపం దాల్చడం లేదన్నారు. వారి విషయంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా న్యాయం చేసే దిశగా చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని తెలిపారు. కొన్ని రాష్ట్రాలలో 2004 సిపిఎస్ అమలుకు ముందర ఉన్న అనేకమంది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపిఎస్ అమలు చేశారని పేర్కొన్నారు. ఆ రకంగా మన రాష్ట్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయు లకు ఓపిఎస్ అమలు చేయాలని వివిధ సమయాలలో వారి తరుపున ఎస్టియు ఏపీ రాష్ట్ర శాఖ ప్రాతినిధ్యం వహించిందన్నారు. ఎన్నిసార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికీ ప్రభుత్వాలలో మాత్రం మార్పు రావడం లేదని, 2003 ఉపాధ్యాయుల ఉమ్మడి వెస్ట్‌గోదావరి జిల్లాలో ఈనెల 18 న తలపెట్టిన ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మున్సిపల్ కార్మికుల అరెస్టు అక్రమం

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర -ఏలూరు: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టిన మున్సిపల్ కార్మికులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయం అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)జిల్లా కార్య దర్శి భజంత్రీ శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఏలూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయం 3 వ సర్కిల్ వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మి కుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు మాట్లా డుతూ మున్సిపల్ ఇంజనీరింగ్, కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు అపరిష్కృతంగా ఉన్న ఆరు డిఏలు,సరెండర్ లీవ్,ఎన్ క్యాష్ మెంట్ చెల్లింపులకు తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైరైన కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు.తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ప్రభుత్వం అన్యాయంగా మున్సిపల్ కార్మికులను అరెస్టు చేసిందని విమర్శించారు. తక్షణం తమ న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి పరిష్కారం చేయాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటాల ద్వారా తగిన గుణ పాఠం చెబుతామని హెచ్చరించారు. సమా వేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, నగర ఉపాధ్యక్షులు బంగారు దుర్గాప్రసాద రావు, యూనియన్ సభ్యులు వంశీ, సోమధుల మల్లేశ్వరరావు, దుర్గారావు, బంగారు అంకమ్మ, అర్జీ సత్యవతి, తోట శాంతి, బంగారు కుమారి, పెందుర్తి రమణమ్మ, పొట్లూరు సురేష్, మాదుగుల దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఆపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ కుక్కునూరు కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య

విశాలాంధ్ర - కుక్కునూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి స్మార్ట్ మీటర్ల విధానం,విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై పెను భారం మోపిందని సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య అన్నారు. కుక్కునూరు మండలంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ ఏడాదిలోనే 4 సార్లు విద్యుత్ చార్జీలను పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్లను గృహాలకు బిగించి కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. ట్రూ అప్,ఇంధనపు సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు,ప్రజలపై భారం తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. ఆదానీ కంపెనీతో జరిగిన సెకి ఒప్పందాలను రద్దు చేసి ప్రమాదకర విద్యుత్ సంస్కరణలు,చట్ట సవరణలు నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ కుక్కునూరు సహాయ కార్యదర్శి కురాకుల బాబూరావు, గిరిజన సంఘం అధ్యక్షుడు వరసా పాపారావు, యువజన సంఘం నాయకులు నాగరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్రరావు,పోట్ల లక్ష్మయ్య, వైకాపా నాయకులు రాయి సత్యనారాయణ, చంటినాయుడు, అల్లేశ్, రవి, కాంగ్రెస్ నాయకులు రఘు,వరసా నాగేశ్వరరావు, వీరయ్య, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) మండల నాయకులు పెంకె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కుడికాలువ ఆక్రమణపై చర్యలు

విశాలాంధ్ర కథనానికి అధికారుల స్పందన

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఆక్రమణ దారుల గుప్పిట్లో.....పోలవరం కుడి కాల్వ గట్టు ' శీర్షికతో ఈ నెల 13 న తేదీన విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. పోలవరం కుడి కాలువ పరిశీలించేందుకు తగిన సిబ్బంది లేక చాలా కష్టంగా ఉందన్నారు. తమ విధుల్లో పోలవరం కుడికాలువ పర్యవేక్షణ నిమిత్తం వెళ్లగా కొంతమంది రైతులు డీజిల్ ఇంజన్ల మోటార్లు ద్వారా నీటిని తోడుకుంటున్నట్లు గుర్తించి రైతులను హెచ్చరించామని పోలవరం కుడి కాలువ అధికారులు తెలిపారు. త్వరలో మోటార్లను తొలగిస్తా మ న్నారు. పోలవరం కుడి కాల్వ గట్టు ఇరు ప్రక్కల ఆక్రమణ లుంటే గుర్తించి పై అధికారులు, రెవెన్యూ అధికారుల సహకారంతో తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కలుపు మందు త్రాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: కలుపు మందు త్రాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం పంచాయతీలోని కొరివి గూడెం గ్రామానికి చెందిన కొరివి సుబ్బారావు (37) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన కలుపు త్రాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తల్లి మంగమ్మ ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: వరి సాగుకు అవసరమైన సాగునీటిని శివారు భూములకు సైతం ఆటంకం లేని విధంగా సరఫరాకు జల వనరుల శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వశిష్ట సమావేశ మందిరంలో సాగునీటి సరఫరాపై ఇరిగేషన్, డ్రైన్స్, ఎర్రకాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగుకు నీటిఎద్దడి ఏర్పడకుండా శివారు భూములకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా ఇరిగేషన్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిరంతరాయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేని విధంగా తూడు, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులును చూసి నిర్లక్ష్యం వహించవద్దని, వర్షాకాలంలో రెండు, మూడు మాసాలు అధిక వర్షాలు, వరదలు ఏ సమయంలోనైనా సంభవించే అవకాశం ఉందని, దీనికి తగినట్టుగా అన్ని విధాల ఇంజనీరింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టాలన్నారు. పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. తొలుత ఇరిగేషన్ కెనాల్స్, డ్రైన్స్ సాగునీటిపారుదల సిస్టం మ్యాపులను పరిశీలించి అధికారు లకు తను సూచన చేశారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, హెడ్ వాటర్ వర్క్స్ ఈ. ఈ జి.శ్రీనివాస్, ఇరిగేషన్, డ్రైన్స్, ఎర్ర కాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.

కోట, సరోజదేవి మృతి తెలుగు సినీ రంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: సినీనటులు కోట శ్రీనివాసరావు సినీ, నాటక రంగాలకు చేసిన కళాసేవ, పోషించిన పాత్రలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద బుధవారం పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సినీనటులు కోట శ్రీనివాసరావు, పద్మశ్రీ బి.సరోజ దేవి సంతాప సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సీతారామ్ ప్రసాద్, పట్టణ కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, సభ్యులు ఎస్ కే చాన్ భాషా, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కోట పోషించిన ఎన్నో మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. కథానాయికగా సరోజదేవి తెలుగు, తమిళంలో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారని, సినీ దిగ్గజాల మరణం ప్రేక్షక లోకానికి తీరని లోటని అన్నారు. చిరుపవన్ తేజం సేవా సమితి అధ్యక్షుడు ఉండిపల్లి రమేష్ నాయుడు, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు పేరిచర్ల లక్ష్మణ వర్మ మాట్లాడుతూ విలక్షణ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో కే చంద్రరావు, సీతారామరాజు, కొండ్రు శ్రీనివాస్, విజ్జు రోతి రాఘవులు, మాట్లపూడి సత్యనారాయణ, కాట్రెడ్డి సత్యనారాయణ, పాండు రంగారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విశాలాంధ్ర

గురువారం 17 ।జులై। 2025

ఉద్యోగాలు కల్పించే కోర్సుల్లో చేరాలి

- కలెక్టర్ చదలవాడ నాగరాణి
- ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: కోర్సుల ఎంపికలో ఒకరిని అనుకరించకుండా ఉద్యోగ అవకాశాలు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు.

బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆర్.ఆర్.డి. ఎస్. ప్రభుత్వ కళాశాలలో సిఎస్ఆర్ ఫండ్స్ 5 లక్షల 60 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కోర్సు ఏమి తక్కువ కాదని, కష్టపడి చదివితే ఏ కోర్సులోనైనా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఇటీవల ఇంజనీరింగ్ కోర్సుల మీద మక్కువతో ఎక్కువమంది వాటిలో చేరి ఉద్యోగ అవకాశాలు రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులను చూస్తున్నామన్నారు. డిగ్రీ కోర్సులు, సాంకేతిక విద్య అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో సత్వర ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నాయన్నారు. పతి ఒక్కరికి చదువుకునే అవకాశం ఉండాలనే సదుద్దేశంతో రాజకీయాలు, కుల మతాలకతీతంగా ఎన్నో విద్యాసంస్థలను స్థాపించిన కీర్తిశేషులు మూర్తి రాజును ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముందుగా మూర్తి రాజు చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, ప్రిన్సిపాల్ ప్రసూన, ప్రముఖ నేత్ర వైద్యులు యు.వి.రమణ రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బిఎ ప్రథమ సంవత్సరంలో ఉన్నతమైన మార్కులను సాధించిన బిఆర్బి సుధీర్ కు, మరింత మంది విద్యార్థులకు కలెక్టర్ మెమెంటోను అందజేశారు. కళాశాల తరపున కలెక్టర్ ను సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన, అధ్యాపకులు ఎస్.లక్ష్మీకాంతం, డాక్టర్ పి.అరవిందస్వామి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, జి.ఉమామహేశ్వరి, డివివి సిహెచ్ సత్యనారాయణ, కంప్యూటర్ ల్యాబ్ అధ్యాపకులు జి.ప్రసాద్ బాబు, లైబ్రేరియన్ యల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఉద్దేశం (1వ పేజీ తరువాయి)

ప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 కార్యక్రమం ఉద్దేశ్యాలను తెలియజేసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సమాజంలో 10 శాతంగా ఉన్న ధనవంతులు, అట్టడుగు స్థాయిలో ఉన్న 20 మంది నిరుపేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు చేయూత నివ్వడమే పీ4 లక్ష్యమన్నారు. జిల్లాలో ఇంతవరకు 95 వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, వారిలో ఇంతవరకు 5181 కుటుంబాలకు మార్గదర్శకులు అండగా నిలబడ్డారన్నారు. కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి మార్గదర్శకులకు పీ4 కార్యక్రమం స్ఫూర్తిని తెలియజేసి వారు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చర్యలు తీసుకున్నా మన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలో ఆర్థిక కారణాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారని, మార్గదర్శకులుగా వచ్చేందుకు ప్రవాసాంధ్రులు ఎందరో ఉన్నారని తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తానూ 10 లక్షల రూపాయల విలువ చేసే 100 గొర్రెలను పేద కుటుంబాలకు అందించి వాటి ద్వారా మరిన్ని గొర్రెలు ఉత్పత్తి అయిన తరువాత తనకు తిరిగి ఇచ్చే పద్ధతిని అనుసరిస్తున్నామన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పారిశ్రామికవేత్తలను మార్గదర్శకులుగా గుర్తించి వారి సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పీ4 కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేదల జీవన ప్రమాణాల స్థాయి మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, ఎంవి.రమణ, ఆర్టీసీ, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ యూనిట్ల కార్యాలయాల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికి చర్యలు

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులకు బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ హామీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మిక సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ భవననిర్మాణ కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర నాయకత్వ బృందం బుధవారం తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జీతో భేటీ అయ్యింది.భవన నిర్మాణ కార్మిక సమస్యలను ఆయనకు వివరించింది. ఈ సందర్భంగా కార్మిక సమస్యల పరిష్కారంపై ఆయన సానుకూ లంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ భవన,ఇతర నిర్మాణ కార్మికసంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ (బుజ్జి),ప్రధాన కార్యదర్శి పడాల రమణ, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమ సుందర్, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, కార్యదర్శి పోలిరాతి ఆదినారా యణ, జిల్లా నాయకులు మెండెం జేమ్స్, కోడె సాయి బాలాజీ, ఏరియా కమిటీ గౌరవాధ్య క్షుడు బోడపాటి నాగేశ్వరరావు, ఏరియా కమిటీ కార్యదర్శి అత్తిలి బాబీ, చల్లా శ్రీనివాస్ తదితరులు వలవల బాబ్జీని కలిసిన బృందంలో ఉన్నారు. ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భవననిర్మాణ రంగం అన్నివిధాలా కుదేలైపోయిందని,కార్మికులు తీవ్ర అవస్తలు పడ్డారని తెలిపారు. అందుకే అత్యధిక కార్మికులు కూటమి గెలుపు కోసం కృషి చేశారని వలవల బాబ్జీ దృష్టికి తెచ్చారు.

ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చిన మేరకు వెల్ఫేర్ బోర్డును క్రియాశీలం చేసి రాష్ట్రంలో పెండింగులో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని పుప్పాల సత్యనారాయణ బుజ్జి,పడాల రమణ విజ్ఞప్తి చేశారు. రిటైరైన భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పింఛను ఇవ్వాలని కోరారు.ఆ మేరకు ఒక వినతిపత్రాన్ని వలవల బాబ్జీ కి అందచేశారు. దానిపై వలవల బాబ్జీ సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యలపై తనకు అవగాహన ఉన్నదని,ఇప్పటికే బోర్డు సమావేశంలో పలు సమస్యల గురించి వివరంగా చర్చించామని, వాటి పరిష్కారం గురించి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళి త్వరలో వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసు కుంటామని వలవల బాబ్జీ హామీ ఇచ్చారు. తొలుత యూనియన్ నాయకులు వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన వలవల బాబ్జీని పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు.

విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలి - అఖిలపక్షం

విశాలాంధ్ర - వేలేరుపాడు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. స్థానిక సీపీఐ కార్యాలయంలో బాడిస రాము అధ్యక్షతన అఖిలపక్షం నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. గృహ వినియోగాలకు సంబంధించి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమైందన్నారు. మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ అప్ చార్జీలు, ఇందనపు సర్దుబాటు తదితర చార్జీలను రద్దు చేయాలని, యూనిట్‌కు రూ. 0.06 పైసల నుండి రూ.1.00 పైసలకు పెంచిన విద్యుత్ సుంకాన్ని తగ్గించాలని, 2024 - 25 మధ్య వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేసిన 2787 కోట్ల

రూపాయలను వెంటనే తిరిగి చెల్లించాలని, 2019 - 25 మధ్య నిధులు 1500 కోట్ల రూపాయలను ట్రూడౌన్ ద్వారా బిల్లులలో తగ్గించాలని, గత సంవత్సరం ప్రభుత్వం ప్రజలపై వేసిన అదనపు విద్యుత్తు భారాలు రూ.15526 కోట్లు రద్దు చేయాలని, వినియోగదారులపై అదనంగా వసూలు చేసే యూనిట్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, కాంగ్రెస్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఎండి మునీర్, కారం దారయ్య, పిట్టా ప్రసాద్, సన్నేపల్లి సాయిబాబు, ధర్మల రమేష్, మడివి దుర్గారావు,సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కరటం ముత్యాలరావు, కొల్లూరు సత్యనారాయణ, వలగాని సమ్మయ్య, ఎండి సఫి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు తెలిపారు బుధవారం. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి

జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, కుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తివాచీ పరిశ్రమకు ప్రోత్సాహం అందించండి

మంత్రి నాదెండ్లను కోరిన ప్రతినిధులు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ఏలూరు నగరానికి ప్రసిద్ధి చెందిన తివాచి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించి తివాచి పరిశ్రమ అభి వృద్ధికి తోడ్పడాలని ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన ప్రతినిధులు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం పీ4 కార్యక్రమం అనంతరం విజయవాడ బయలు దేరుతున్న మంత్రి మనోహర్‌ను ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన

మహమ్మద్ ఇంతియాజ్ అహమ్మద్ తన సంస్థ ద్వారా నేసిన తివాచీలను మంత్రి మనోహర్‌కు చూపించారు. తివాచి పరిశ్రమకు ఏలూరు నగరం పెట్టింది పేరని, ప్రస్తుతం తివాచి పరిశ్రమ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుం దని, ఏలూరులోని తివాచి పరిశ్రమకు పూర్వ వైభవం వచ్చేలా తోడ్పాటు అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రి మనోహర్ సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తానని ఇంతియాజ్ అహమ్మద్ కు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రమణ్యేశ్వర రావు, ప్రభృతులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-ఏలూరు: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ వరప్రసాద్‌ను సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు, ఏఐటీ యూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి. కిషోర్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. వరప్రసాద్ త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యంతో విధి నిర్వహణలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి టీచర్ల సహాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని రామవరం పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న మడివి అభి అనే విద్యార్థికి ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఆర్థిక సాయం బుధవారం అందిం చారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అభిని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టి ట్యూట్ విజయవాడ క్యాన్సర్ హాస్పటల్‌కు చికిత్స కొరకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఆ విద్యార్థి తండ్రి సింగయ్యకు

25 వేల రూపాయలు నగదు అందించారు. రెక్కాడితే గాని పూట గడవని ఆ కుటుంబానికి దాతలు ముందుకొచ్చి సహాయం అందించాలని టీచర్స్ విజ్ఞప్తి చేశారు. వైద్య నిమిత్తం సహాయం అందించిన టీచర్స్ కు సింగయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. బంధం. వీరబాబు, పూనెం సుందర్, కొర్ర లక్ష్మి కాంత, నాగుల సత్యవతి, మడెం అంజలి, తెల్లం వీరబాబు, శివజ్యోతి, రాంబాబు, పిట్టా మధు, కట్టం రామూర్తి, తెల్లం పోసి, వెంకట్రావు, వాళ్ళ దేవిరెడ్డి, కౌలూరి పాపారావు తదితర టీచర్లు సహాయం అందించిన వారిలో ఉన్నారు.

రేటు పెరగాలి (1వ పేజీ తరువాయి)

తెలిపారు. మాతృ, శిశు ఆరోగ్యం కోసం గర్భధారణ, బిడ్డకు, బిడ్డకు మధ్య అంతరం పై దంపతులకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలు కాన్పులు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలకు అవసరమైన మందులు, వైద్య చికిత్స, పౌష్టికాహారం ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం మరియు అంతరం, మేము పిల్లలం - అప్పుడే కాము తల్లులం "ఇక చాలు ఆపండి "అనే రెండు గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులుమీదగా ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో లక్కీ డిప్ ద్వారా ఎంపికైన పదిమంది తల్లులకు నగదు పురస్కారాలను, ఎక్కువ గర్భనియంత్రణ ఆపరేషన్లు చేసిన వైద్యులకు, ఆరోగ్య పద్ధతులపై ప్రోత్సహించిన మోటివేటర్స్‌కు కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ సుధా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ని కలిసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం సభ్యులు

విశాలాంధ్ర - కడియం : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు సంఘం నేతృత్వంలో బుధవారం ఉండవల్లిలో రాష్ట్ర మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి నారా లోకేష్‌ని కలిశారు. వివిధ రాష్ట్రాల్లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు అమలవుతున్న ప్రోత్సాహకాలు గురించి వివరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు మన రాష్ట్రంలో ఎలాంటి ప్రోత్సాహకాలు అమలు కావటం లేదని వారు మంత్రికి చెప్పారు. జాతీయ అవార్డు గ్రహీతలకు గతంలో అమలయ్యే ఒక సంవత్సరం పాటు సర్వీసు పొడిగింపు, బదిలీల్లో పది అదనపు పాయింట్లు వంటి రాయితీలు తీసేసారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాసరావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర సంఘం ప్రతినిధులు ఎర్రా ఎస్‌ఎస్ వి ఎస్ చక్రవర్తి, కొణతాల పణిభూషణ్ శ్రీధర్, గోరంట్ల శ్రీనివాస్, కైతేపల్లి దాస్ తదితరులు ఉన్నారు.

పల్లెపల్లెకు ప్రగతి సాధించి చూపిస్తాం : బొడ్డు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో పల్లెపల్లెకు ప్రగతి సాధించి చూపిస్తామని రుడా ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా టీడీపీ మండల అధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు అధ్యక్షతన మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో రుడా ఛైర్మన్ పాల్గొని గ్రామ వీధుల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో గత ఏడాది కాలంలో అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ 'సూపర్ సిక్స్' అమలుతో ఏపీ ప్రజల్లో సంతోషాలు వెల్లివేరుస్తున్నాయనారు. అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయింది. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక హోటల్ వద్దకు వచ్చేసరికి ఊతప్పం వేస్తున్న హోటల్ యజమానులు కష్టాన్ని చూసిన రుడా ఛైర్మన్ వాళ్ళతో ముచ్చటించారు. స్వయంగా ఊతప్పాలు వేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, మండల టీడీపీ కార్య దర్శి బుద్దిగా అప్పారావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి, నాయకులు చిట్టిప్రోళ్ళ పద్దరాజు, సోడసాని త్రిమూర్తులు, సంగుల శ్రీను,ముత్యం రాజబాబు, సంగీత సత్తిబాబు, పెద్దిశెట్టి నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కడియం : కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సొంత భవనాలు కలిగిన అంగన్వాడీ కేంద్రాలకు ఎల్ఈడి టీవీ, వాటర్ ప్యూరిపయర్, నాలుగు రకాల ఆట పరికరాలు, అంగన్వాడీ కేంద్రాల పిల్లలందరికీ పీపీ1, పీపీ 2 పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండలానికి సంబంధించి 31 అంగన్వాడీ కేంద్రాలకు పరికరాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మపేట అంగన్వాడికేంద్రం నందు బుధవారం ప్రారంభించారు. అనంతరం వెంకాయమ్మ పేటలో గల 8 మంది గర్భిణీలకు సీమంతం, 2 చిన్నారులకు అన్న ప్రాసన చేసారు. ఈ కార్యక్రమంలో

గ్రామ సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, బొరుసు సుబ్రహ్మణ్యం, పిడి సిహెచ్ లక్ష్మి, ఎసిడిపిఓ టి కనకవల్లి, సూపర్ వైజర్లు సత్య శ్రీ, శిరీషా, ఎన్ నాగ జయలక్ష్మి అంగన్వాడీలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజలు తమకున్న తగాదాలు వివాదాలు, కేసులు మధ్యవర్తిత్వంతో వేగవంతంగా పరిష్కరించుకోగలమని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం అనురాధ అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై పదో తేదీ నుండి 16 వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించడంలో భాగంగా మీడియేషన్ ఆఫ్ నేషన్ అని పిలుపునివ్వడంతో కొవ్వూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎం అనురాధ

మాట్లాడుతూ పెండింగ్‌లోవున్న కేసులను పరిష్కరించుకోవడంలో మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని వేగవంతమైన కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ జీవిఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి సాయి కృష్ణ, కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వర్రె నాగ మురళి కృష్ణ, ట్రైన్ మీడియట్ వై ప్రకాష్ రావు, యాగంటి చలపతిరావు, ఉప్పల కృష్ణారావు, బొంత డింపుల్, మడపల్లి శ్రీవల్లి, వి నంద, తాడేపల్లి ప్రభాకర్, కెవి రమణ, టి రవికుమార్, కొవ్వూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి విశ్వం తదితర న్యాయవాదులు న్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ దేవరపల్లి మండల శాఖ కౌన్సిల్ సమావేశం పప్పు వెంకట రామారావు అధ్యక్షతన జరిగింది. రాబోయే మూడు సంవత్సరాల కాలానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణమూర్తి, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు వ్యవహరించారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా కేశిరాజు సీతారామయ్య, అధ్యక్షుడిగా పప్పు వెంకట రామారావు , అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ సయ్యద్ అలీ సాహెబ్, వెలిచెర్ల సూర్యనారాయణమూర్తి ప్రధాన కార్యదర్శిగా గద్దె కృష్ణారావు కోశాధికారిగా కుమారి చిందాడ సుగుణలత, ఉపాధ్యక్షుడిగా బండి సూర్య ప్రకాష్‌రావు ఎలమాటి సత్యనారాయణ, ఈడుపుగంటి నాగేశ్వరరావు, ఉప్పలపాటి కళావతి, కార్యదర్శులుగా వీరవల్లి శేషు, మణి వై పద్మజ సిరి శెట్టి ఈశ్వరరావు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హుస్సే శంకరుడు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్గా ఆచంట సుభాష్ చంద్రబోస్ ఎన్నికయ్యారు. జిల్లా

అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మీ మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే ట్రెజరీలో రిప్రజెంట్ చేసి పరిష్కారం చేస్తామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 12వ పిఆర్సి వెంటనే నియమించి 30% మధ్యంతర భృతి ప్రకటించాలని అన్నారు. హెల్త్ కార్డులపై నగదురహిత వైద్యం అందజేయాలన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దువ్వూరి కామేశ్వర శర్మ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీ సాహెబ్ అతిథులుగా హాజరయ్యారు.ఈ సమావేశంలో యబ్ రోలర్ ఈవెంట్లో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో మూడు బంగారు పతకాలు సాధించిన దేవరపల్లి గ్రామవాసి వానపల్లి సత్యనారాయణ ను ఘనంగా సత్కరించడం జరిగింది...

16 కోట్ల ఇంజక్షన్ అందకుండానే ప్రాణాలు విడిచిన చిన్నారి

విశాలాంధ్ర - కడియం : అరుదైన అనారోగ్యంతో బాధపడుతున్న బోసి నవ్వుల చిన్నారి మృత్యువుతో పోరాడి, ఓడి ప్రాణాలు విడిచింది. కడియం మండలం, మాధవరాయుడుపాలెం పంచాయతీ, చైతన్య నగర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్, శ్రావణిల కుమార్తె మోహనకు ఈ వ్యాధి వచ్చిన సంగతి తెలిసిందే. రెండు నెలలకే ఆ పాప అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి వెళ్తే స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్ -1 సమస్య వచ్చిందని హైదరాబాదు లోని ప్రముఖ నిమ్స్, రైన్ బో ఆసుపత్రి వైద్యులు తేల్చి చెప్పారు. చిన్నారికి రెండు ఏళ్ల లోపు సుమారు 16 కోట్ల రూపాయలు ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంది. లేకపోతే ప్రాణాలకు ప్రమాదం. అప్పటివరకు ఆరు లక్షల రూపాయల విలువైన సిరప్‌ను పాపకు అందించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతల సహకారం కొరకు ప్రయత్నాలు జరుగుతుండగానే చిన్నారి మృతి చెందింది. రాజ మహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు ప్రయత్నాలు



జరుగుతున్నాయి. ఇటీవల రాజమహేంద్రవరం వచ్చిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంజక్షన్ కు అవసరమైన నిధులు రాబట్టేందుకు ప్రయత్నాలు చేపట్టారు. సోమవారం కూడా ఇందుకు కావాల్సిన వివరాలు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి కి చిన్నారి తల్లిదండ్రులు అందించారు. ఇటువంటి పరిస్థితుల్లో పాప మృతి చెందిన వార్త అందరిని కలచివేస్తుంది.

నాణ్యమైన ఆరోగ్య సేవలకు కృషి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కే. వెంకటేశ్వరరావు బుధవారం కడియపులంక, పెరవలి, ఉండ్రాజవరం, సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. సందర్శన సమయంలో RCH సేవలు (ప్రజనన మరియు శిశు ఆరోగ్యం),గర్భిణీ స్త్రీల తల్లిదండ్రుల సంరక్షణ, ఏంటి నేటల్ చెకప్‌లు, ఫాలోఅప్‌లు, సంస్థాగత ప్రసవాలు, RBSK కార్యకలాపాలు స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ,బంగారుకుటుంబం కార్యక్రమం,ల్యాబ్ సేవలు మరియు మందుల లభ్యత, సిజినల్ వ్యాధుల నివారణ చర్యలు వంటి కార్యక్రమాలపై తనిఖీలు నిర్వహించడం జరిగింది. సంబంధిత వైద్య అధికారులు, సిబ్బందికి రోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సేవల నాణ్యతను పెంపొందించాలని, పనితీరు మెరుగుపరచాలని సూచనలు ఇవ్వడం జరిగింది. నాణ్యమైన ఆరోగ్య సేవలందించడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేస్తుంది జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, రాజమహేంద్రవరం వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియపులంక, పెరవలి, ఉండ్రాజవరం మరియు సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కడియం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి అన్నారు. బుధవారం మండలం లోని కడియపులంక, వెంకయ్యమ్మపేట గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం ద్వారా మహిళలకు భారం తప్పిందన్నారు. తల్లికి వందనంతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు జమ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, టిడిపి రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - గండేపల్లి, జగ్గంపేట : సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కార్మికులు 53 మంది తమకు రావలసిన 19 నెలల జీతాలు ఇవ్వాలని గత తొమ్మిది రోజులుగా విధులు బహిష్కరించి రాజమండ్రి లాలాచెరువు సెంటర్లో గల రక్షిత మంచినీటి పథకం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద తమకు న్యాయం చేయాలని సమ్మె చేస్తున్నా సరే ప్రభుత్వం సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేయడంపై సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. 100 గ్రామాలలో ప్రజలు సత్యసాయి పైప్ లైన్ ద్వారా వచ్చే మంచినీళ్లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు తాగునీరు అందించడం, తాగునీరు అందించే కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, ప్రజలకు ఉచిత తాగునీరు అందించాల్సిన ప్రభుత్వం సత్యసాయి తాగునీటి పథకానికి నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సంబంధిత పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పందించి వీరి సమస్యను పరిష్కరించి తక్షణమే 90 గ్రామాలకు సత్యసాయి పథకం ద్వారా తాగునీరు అందించాలని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు. జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం శాసనసభ్యులు మరియు జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకొని సమస్య తక్షణం పరిష్కరించాలని సూర్యచంద్ర డిమాండ్ చేశారు.

19న సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక బండివారిపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అమలాపురం నియోజకవర్గం నూతన కమిటీతో సమావేశమైన జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కే సత్తిబాబు, కార్యదర్శి గూడాల వెంకటరమణ, సహాయ కార్యదర్శి ఊటాల వెంకటేష్, ఊటాల వెంకటేష్, నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులతో 19న జిల్లా నాలుగు మూలల నుంచి వచ్చేపార్టీ సభ్యులు, సానుభూతిపరులు, కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలను స్వాగతించి ఆతిథ్యం ఇవ్వాల్సిన కర్తవ్యం మన పైన ఉందని అందుకు టీములుగా ఏర్పడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అమలాపురం పట్టణం అంతా అరుణ పతాకాల తోటి, తోరణాలతోటి, ఫ్లెక్సీలతోటి పెద్ద ఎత్తున అలంకరించాలని, ఇదంతా ఏఐటియుసి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల నేతృత్వంలో 18వ తారీకు అంత అలంకరణ పూర్తిచేయాలని షెడ్యూల్ ఇచ్చారు. 19వ తేదీ ప్రదర్శన బహిరంగ సభ జయప్రదం అయ్యేవరకు మనమంతా వాలంటీర్స్‌గా పనిచేసే సేవలందించాలని సత్తిబాబు 19న పిలుపునిచ్చారు.

సుపరిపాలన తొలిఅడుగు : మంత్రి నారాయణ

విశాలాంధ్ర - పిఠాపురం : గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఖజానాను అంతా ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టాడని నేడు రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తుందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ తెలియజేశారు. పిఠాపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హాజరయ్యారు. పిఠాపురం మహారాజా కోట ఆవరణలో గల టీడీపీ కార్యాలయం నుండి మాజీ ఎమ్మెల్యే వర్మ మంత్రి నారాయణ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. పిఠాపురం పట్టణం కోటగుమ్మం సెంటర్ మీదుగా మిరపకాయల వీధి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం మిరపకాయల వీధిలో తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దారి పొడుగునా మంత్రి నారాయణకు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలుకారు. అనంతరం జరిగిన సభలో మంత్రి నారాయణ, మాజీ ఎమ్మెల్యే వర్మ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ, గిరీష్ వర్మ చేతుల మీదుగా మంత్రి నారాయణను, జ్యోతుల నవీన్‌ను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్, భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణ రాజు, బిజెపి పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర- కొవ్వూరు : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కొవ్వూరు పురపాలక సంఘంలో పనులు నిలుపుదల చేసి సమ్మె ప్రారంభించారు జరిగిన సభలో జేఏసి - సిఐటియు నాయకులు రాజన్న అప్పారావు ఏం.సుందర్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల అందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలనిచనిపోయిన వారి స్థానాల్లో వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని సర్వీస్ 62 ఏళ్లకు పెంచాలని ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుండి 7 లక్షలకు, దహన సంస్కారాలు మట్టి ఖర్చుకు 15000 నుండి 20వేలకు జీవోలు విడుదల చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న తరహాలో జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం నుండి విజయ విహార్ సెంటర్ వరకు రాలి నిర్వహించారు భూపతి రవీంద్ర పూజారి వాసు కళ్యాణ్ రాజేష్ కారంకి ప్రసాద్ అల్లం విజయకుమార్ మీసాల శివశంకర జ్యోతి అల్లం వెంకటలక్ష్మి మీసాల వరలక్ష్మి సంగం రెడ్డి వెంకటరమణ కార్మికులు పాల్గొన్నారు

సూర్యారావు మృతికి నేతల నివాళి

విశాలాంధ్ర -దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని దుద్దుకూరు మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావుకు బుధవారం ప్రముఖులు ప్రజా ప్రతినిధులురాజకీయ నాయకులు దుద్దుకూరు గ్రామ ప్రజలు ఘనంగా నివాళు లర్పించారు కరుటూరి సూర్యారావు వయోభారం వలన సోమవారం మృతి చెందారు బుధవారం ు కరుటూరి సూర్యారావు స్వగృహం వద్ద ప్రముఖులు రాజకీయ నేతలు నివాళులర్పించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూర్యారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరుటూరి సూర్యారావుకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు కరుటూరి శ్రీరామ్ మూర్తి, రెండవ కుమారుడు కరుటూరి ధనుంజయుడు వ్యాపారవేత్తగా పారిశ్రామికవేత్తగా తెలుగుదేశం పార్టీ నాయకుడిగా మంచి గుర్తింపు పొందారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు ధనుంజయుడు అతి సన్నిహితుడు వ్యాపార రంగంలో రాణించి ధనుంజయుడు ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మందికి ఉపాధి కల్పించారు. కరుటూరి సూర్యారావు మరణ వార్త తెలియగానే గోపాలపురం నియోజకవర్గం నుండి బంధువులు స్నేహితులు రాజకీయ నాయకులు దుద్దుకూరు తరలివచ్చి సూర్యారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాడే మోశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కరుటూరి గంగరాజు ముళ్ళపూడి దొరాజ చౌదరి ముళ్ళపూడి గంగాధరరావు ముళ్ళపూడి సత్యనారాయణ ఆచంట శేషారావు కంటిపూడి సుబ్బారావు బల్ల సూర్య చక్రం కాకర్ల రామారావు నందిన మోహనరావు దుగ్గిన లీలా కృష్ణ కాండ్రు రామకృష్ణ సాంబ సూర్యచంద్రం కె రవికుమార్ కాకర్ల సృజన మింటిమి సురేష్ ముళ్ళపూడి సత్యనారాయణ కొడవటి బుజ్జిబాబు కరుటూరి బ్రదర్స్ కరటూరి సూర్యారావు సమీప బంధువులు గోపాలపురం నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు కరుటూరి ఫంక్షన్ హాల్స్ పద్మ శ్రీనివాస గ్యాస్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజానగరం : తమ నియోజకవర్గంలో పేదరికం నిర్మూలన చేపట్టడంతో పాటు ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తామని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఎంపీడీవో జెవి.ఝాన్సీరాణి అధ్యక్షతన బుధవారం జరిగిన స్వర్ణాంధ్ర విజన్ 2047 అనే అంశపై బుధవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తొలుత నియోజక వర్గంలో చేపట్టనున్న స్థిరమైన, సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ అంశాలను వివరించారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు సంకల్పించిన స్వర్ణాంధ్ర విజన్ 2047తో మా విజన్ గుర్తుకు వచ్చిందని,దీనిలో భాగంగా నియోజకవర్గంలోవిద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయడం, దివాన్ చెరువు గ్రామంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు, రాజానగరం సీతానగరం, కోరుకొండ మండల కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు, బూరుగుపూడి గాదాల రహదారి లో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు, నియోజకవర్గ స్థాయిలో బ్లడ్ బ్యాంక్ మరియు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, గోదావరి జలాలను రాజానగరం నియోజకవర్గ గ్రామా లకు సరఫరా చేయడంతో పాటు రైతులకు సరిపడా సాగునీటిని అందించాలనే అంశాన్ని విజన్ డాక్యుమెంట్ నందు పొందపరుస్తునట్లు చెప్పారు. ఇంచార్జీ ఆర్డీవో భాస్కర్,తహశీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, సీతానగరం,కోరుకొండ ఎంపిడివోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - కాకినాడ : మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని కాకినాడ మూడవ జిల్లా జడ్జి ఆనంది పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం 'వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుండి జిజిహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది ఏళ్ల తరబడి న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇటువంటివారు గౌరవప్రదంగా కేసులు పరిష్కరించు కునేందుకు మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ భీరా శ్రీనివాస్, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్ విజయబాబు, మూడవ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కే మోతిలాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమంలో పరీక్షలు అనుమతించాలి : సుబ్బరాజు

విశాలాంధ్ర - కాకినాడ : రాబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఇంగ్లీషులోనే వ్రాయాలని, తెలుగులో వ్రాయడానికి అనుమతించబోమని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించి తెలుగులో పరీక్షలు రాయడానికి అనుమతి కొనసాగించాలని జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షులు పి సుబ్బరాజు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేసి తెలుగు రాష్ట్రంలో తెలుగులో చదువుకునే అవకాశం లేకుండా చేసిందని, తెలుగువారి ఆత్మాభిమానం నినాదంతో స్థాపించబడిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ పొరపాటును సరిదిద్ది ఇంగ్లీషుతో పాటు తెలుగు మాధ్యమంలో కూడా చదువుకునే అవకాశం పునరుద్ధరిస్తుందని అందరూ ఆశించారు. దీనికి విరుద్ధంగా కనీసం తెలుగులో పరీక్షలు రాసే అవకాశం కూడా రద్దు చేయడం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గత ప్రభుత్వం తెలుగు మాధ్యమం రద్దు చేసినా తెలుగు, ఇంగ్లీషు రెండు భాషలలో పాఠ్యపుస్తకాలు ముద్రించి తెలుగులో చదువుకుని, తెలుగులో పరీక్షలు వ్రాసే వెసులుబాటు కల్పించిందని, టీడీపీ ప్రభుత్వంలో ఈ వెసులుబాటను రద్దు చేయడం ప్రజా వ్యతిరేక అనాలోచిత చర్యని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం వల్ల పాఠశాలలలో తెలుగు పూర్తిగా కనుమరుగవుతుందని, విద్యార్థులు కేవలం బట్టీ చదువుల మీదనే ఆధారపడ తారని, ఇప్పటికే దారుణంగా దిగజారిన అభ్యసన స్థాయిలు మరింత పతనమవుతాయని, రాష్ట్రంలో కనీసం తెలుగు భాషలో పరీక్ష రాసే వెసులుబాటు రద్దు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించకపోతే విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, జనవిజ్ఞాన వేదిక, ఇతర మేధావులతో కలిసి తెలుగు భాష పరిరక్షణ ఉద్యమం చేపడతామని సుబ్బరాజు తెలియజేశారు. అరసం కార్యదర్శి పి పద్మజవాణి, జనవిజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మన తాతారావు, పోతు రామకృష్ణ తదితరులున్నారు.

డిసెంబర్ నాటికి టిడ్కో గృహాలు లబ్దిదారులుకు అందజేత : మంత్రి

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 365/430 కేటగిరి టిడ్కో గృహాలన్నిటినీ వచ్చే డిశంబరు నాటికి పూర్తి చేసి లబ్దిదారులుకు అప్పగించాలని జిల్లా ఇన్ చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా అధికారులు, ప్రజా ప్రతి నిధులతో కాకినాడ జిల్లా సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్ చార్జి మంత్రి పొంగూరి నారాయణ అధ్యక్షతన కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు. సమావేశంలో తొలుత జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను కమిటీకి వివరించారు. అనంతరం అంజెండా అంశాలలో తొలి అంశంగా జిల్లాలో జీరో పోవర్టీ, పి-4 కార్యక్రమ అమలు ప్రగతిని వివరిస్తూ, జిల్లాలో 1,02,450 బంగారు కుటుంబాలను గుర్తించగా, వచ్చే ఆగష్టు 15 నాటికి వీరిలో 80,158 కుటుంబాలను మార్గదర్శులు దత్తత స్వీకరించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. స్వర్ణాంధ్ర పి4 కార్యక్రమం క్రింద ఈ నెల 17 నుంచి ఆగష్టు 5వ వరకూ గ్రామ, వార్డు సభలలో బంగారు కుటుంబాల వాలిడేషన్ నిర్వహిస్తామని, ఈ నెల 18, 19 తేదీలలో మాస్టర్ ట్రైనీలు, సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాలు, 21 నుండి ఆగష్టు 6వ తేదీ వరకూ బంగారు కుటుంబాల అవసరాల సర్వే నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో 3,844 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత స్వీకరించారని తెలియజేశారు.

జిల్లాలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శులుగా సుమారు 10 వేల కుటుంబాలను దత్తత చేపట్టే కార్యక్రమం జరుగుతోందన్నారు. దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పి-4 కార్యక్రమంలో చైతన్యవంతమైన భాగస్వామ్యం వహించాలని కోరారు. ఆగష్టు 1 నుండి పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్‌ల ద్వారా నీటిని ఏలేరు, పిబిసికి సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో జలాలు పెరిగినందున ఆగష్టు 1 వరకూ ఆగకుండా, వెంటనే నీటిని లిఫ్ట్ చేస్తే రైతులు అదును దాటిపోకుండా నారుమళ్ళ చేపడతారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. సత్వరం నీటి సరఫరా చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ నియోజక వర్గ పరిధిలో 11 ఏళ్లగా ఎన్నికలు జరగని 7 గ్రామ పంచాయితీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక, సాధారణ నిర్వహణ కష్టం అవుతోందని, ఈ పంచాయితీలను కాకినాడ నగరంలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద చేపట్టి నిధుల లేక ఆగిపోయిన పలు పనులు పూర్తి చేయించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంత్రిని కోరారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తే నగరంలోని పారిశుద్యాన్ని మరింత మెరుగుపరచవచ్చునన్నారు. గృహ నిర్మాణ చర్చలో గత ప్రభుత్వం నిర్మాణానికి అనువుగా లేని స్థలాలు కేటాయించడం వల్ల చాలా మంది లబ్దిదారులు ఇళ్లు కట్టుకోలేక పోయారని, వీటికి బదులు పోలవరం స్పోయిల్ లాండ్స్‌లో స్థలాలు కేటాయించేందుకు పరిశీలించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఆన్ లైన్‌లో పేర్లు లేకపోయినా, ఎటువంటి స్థలం కేటాయించకుండా, అధికారుల కూడా తెలియకుండా, లబ్దిదారులను మభ్యపెట్టి గత ప్రభుత్వ హాయాంలో జారీ చేసిన ఫేక్ పట్టాల అంశంపై ఎంక్వయిరీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కట్టకుండానే లబ్దిదారుల పేర 140 కోట్లు రుణాలు తీసుకుని డైవర్ట్ చేయడం వల్ల అవి బ్యాంకులకు ఎన్‌పిఏలుగా మారాయని, ఈ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం కట్టి, సగంలో ఆగిపోయిన 365/430 కేటగిరి ఇళ్లన్నిటినీ వచ్చే డిశంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం చేపట్టిందని ఇన్‌చార్జి మంత్రి తెలిపారు. మున్సిపల్ సమీక్షలో అన్ని పట్టణాలు ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఆయా నియోజక వర్గాలలో ఎదురౌతున్న స్థానిక సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రి, కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కారాలను కోరారు. సమావేశంలో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్ క్రింద పెద్దాపురం సిల్క్ చీర ఉత్పత్తులు ఎంపికైనందుకు అధికారులను, నేతన్నలను, రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో పతకాలు సాధించిన యోగ సాధకులను ఇన్‌చార్జీ మంత్రి నారాయణ అభినందించారు. అనంతరం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి సమావేశంలో చర్చించిన అంశాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మ, పిఠాపురం నియోజక వర్గ జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : నాగులపల్లి గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగులపల్లి శివాలయం సెంటర్ రైతు క్లబ్ వద్ద గౌతమీ నేత్రాలయం, రాజమండ్రి అనుబంధ సంస్థ జగ్గంపేట వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత కంటి ఆపరేషన్ చేయించడంతోపాటు అతి తక్కువ ధరలకే కళ్ళజోళ్ళు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామస్తులు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఉన్నత పాఠశాలను జల శక్తి మినిస్ట్రీస్ తనిఖీ

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం జల శక్తి మినిస్ట్రీస్‌కి సంబంధించిన ఏఎఎస్ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 వార్షిక తనిఖీలలో భాగంగా తరపు ఉన్నత పాఠశాలను సందర్శించి తనిఖీలు చేయడం జరిగిందని, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఎన్ రాజేశ్వరి పేర్కొన్నారు. జల శక్తి మినిస్ట్రీస్ సభ్యులు బాత్రూములు క్లీనింగ్, హ్యాండ్ వాష్ సౌకర్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారని ఆమె పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి యు నిర్మలాదేవి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు డీఎల్‌పీవో తనిఖీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం నడకుదురు గ్రామంలో పారిశుధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరణ అమలు జరుగు విధానంపై బుధవారం డివిల్పిఓ, అన్నామణి ఆకస్మిక తనిఖీలు చేశారు. గ్రామంలో అమలు జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారని పంచాయతీ కార్యదర్శి వరిజ పేర్కొన్నారు. ఎన్‌డబ్ల్యు పిసి కేంద్రాలను తనిఖీ చేసి ఎరువులు తయారిని అడిగి తెలుసుకున్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కార్యదర్శి పేర్కొన్నారు.



వాహన డ్రైవర్ల నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండల విద్యాశాఖ, పోలీస్, ఏఎస్‌డబ్ల్యూ ఏ ఆధ్వర్యంలో బుధవారం మలికిపురంలో ప్రైవేట్ విద్యా సంస్థల వాహనాల డ్రైవర్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలికిపురం ఎస్ఐ సురేశ్ పాల్గొని మాట్లాడుతూ..వాహన డ్రైవర్ల అందరూ లైసెన్స్ కలిగి ఉండి వెహికల్ ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. అదేవిధంగా అధిక వేగం, అధిక లోడు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన డ్రైవర్ల అందరూ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు విజయశ్రీ, ఎం సత్యనారాయణ, ఎఎస్‌డబ్ల్యూ ఎ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి 50 వేలు విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీశైలం శ్రీ ఉమామాలింగేశ్వర దేవాంగ నిత్య అన్నదాన సత్రంనకు శాశ్వత అన్నదాన పథకానికి రూ.50,000లు విరాళం అందజేశారు. వివి మెరక, గాంధీనగర్ వాస్తవ్యులు కంధనాల కోట నాగయ్య, భ్రమరాంబ జ్ఞాపకార్థం ఈశ్వరసూర్య నాగ ముత్యాలరావు, పార్వతి, మనమలు రూ.50,000లు అందించారు. వీరిని బండారులంక శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చైర్మన్ బొమ్మన దుర్గా ప్రసాద్ రావు, సెక్రటరీ కాలేపు సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

స్పందించిన ఆర్టీసీ అధికారులు

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల కేంద్రమైన కాట్రేనికోన గేట్ సెంటర్లో ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టర్ వద్ద ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలన్న ఫిర్యాదుపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఇటీవల కాట్రేనికోనకు చెందిన వ్యక్తి బస్ షెల్టర్ వద్ద ఆక్రమణలు, అక్రమ వ్యాపారాలతో ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి, అమలాపురం డిపో మేనేజర్ బస్‌షెల్టర్‌ను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టారు. బస్సు షెల్టర్‌కు నేమ్ బోర్డ్, బస్సుల రాకపోకల సమయాలు తెలుపే బోర్డు, హెచ్చరికల బోర్డులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే షెల్టర్‌లో వ్యాపారాలు చేస్తున్న లైసెన్సుదారులకు టెండర్ నియమ నిబంధనలు

పాటించాలని, లేకుంటే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. బస్ షెల్టర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బస్ షెల్టర్ సక్రమ నిర్వహణకు స్థానికులు సహకరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు. భవిష్యత్తులో షెల్టర్ ఎదుట, లోపల ఆక్రమించి అక్రమ వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కూడా స్థానిక పోలీస్ ఎస్ఐ దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆర్టీసీ అధికారులు లేఖలో తెలిపారు. ఆర్టీసీ అధికారులు బస్ షెల్టర్‌లో సౌకర్యాలు కల్పించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాడపల్లి క్షేత్రంలో మెరుగైన సౌకర్యాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో గల కోనసీమ తిరుమలగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాల మెరుగుదల కొనసాగుతోంది. శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు అనుకూలంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్యూలైన్లను విస్తరించడంతో పాటు, ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద వెడల్పాటి మార్గాలను ఏర్పాటు చేయడానికి తక్షణమే చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న లడ్డు కౌంటర్లకు అదనంగా మరికొన్ని కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు వైద్య సాయం అందించేందుకు మెడికల్ క్యాంపులను సైతం విస్తృత స్థాయిలో ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఏ విధంగానూ అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను బుధవారం ఎమ్మార్వో టి రాజేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు, ముదునూరి వెంకటరాజు పరిశీలించారు.

'యోగాంధ్ర' స్టేట్ విన్నర్స్‌కు అభినందనలు

విశాలాంధ్ర - కాకినాడ : యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా రాష్ట్రస్థాయిలో విజయవాడలో నిర్వహించిన స్టేట్ లెవెల్ యోగ చాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన రాష్ట్ర యోగ విజేతలు మరియు విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీతో కలసి యోగాభ్యాసంలో పాల్గొన్న జిల్లాకు చెందిన స్టేట్ యోగ విన్నర్స్‌ను బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్ష సమావేశం అనంతరం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇంచార్జ్ మంత్రి పి నారాయణ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఆంధ్రప్రదేశ్ యోగ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎస్ నాయకర్, జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకులు యోగాచార్య చిట్టూరి చిట్టిబాబులతో కూడిన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి గర్వకారణంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ చేతులు మీదుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు "రాష్ట్ర యోగ పోటీ విజేతల అభినందన జ్ఞాపిక"ను అందజేశారు. రాష్ట్ర యోగ పోటీల విజేతలు డి దుర్గ శాంత ప్రసాద్ (ఫోటోగ్రఫీ), సయ్యద్ యాసిన్ మొహిద్దీన్ (వ్యాస రచన), ఎం సతీబాబు (పోస్టర్ (ప్రెజెంటేషన్) కె ఆదిత్య



(యోగ సాంగ్స్), కెబివి శివ సాయి రామ్, జి లహరి దుర్గ, ఆర్ చైత్ర శివ వాసుకి, జి దివ్యాం జలి, బి లక్ష్మిలు (సోలో యోగ, మిక్స్ యోగ, సింక్రొనైజ్డ్ యోగ అంశాలు) తదితరులు వివిధ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న 12 మంది రాష్ట్ర విజేతలను అభినందించారు.

విశాలాంధ్ర

సీపీఐ కాకినాడ జిల్లా మహాసభ దృశ్యమాలిక

సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న తాటిపాక మధు, వేదికపై నేతలు.

పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు వివిధ ప్రజాసంఘాల కార్మికులు ర్యాలీ

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులు దేగ ప్రభాకర్‌రావు. తాటిపాక మధు, కిర్ల కృష్ణారావు, కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్, మండల రమణ.

టెర్రరిజం కంటే మాదకద్రవ్యాల సృష్టించే విధ్వంసాలు ఎక్కువ : రవికృష్ణ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రపంచంలోని పలు దేశాల్లో టెర్రరిస్టుల ద్వారా జరిగే విధ్వంసం కంటే మాదక ద్రవ్యాల వలన సృష్టించే విధ్వంసాలు ఎక్కువని ఈగిల్ టీం ఐజి రవికృష్ణ స్పష్టం చేశారు. ఏలూరులోని ఆశ్రమ వైద్య కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనార్థాల గురించి వైద్య విద్యార్థులకు ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్, ఈగిల్ టీం ఐజి శ్రీ రవి కృష్ణ, ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐజి రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల నుండి రవాణా అవుతున్న మత్తు పదార్థాల కొనుగోలు చేసిన డబ్బులతో టెర్రరిజం పెరుగుతుందన్నారు. ఒక వ్యక్తి వెయ్యి రూపాయలు పెట్టి మత్తు పదార్థాన్ని కొనుగోలు చేస్తే ఆ డబ్బులు టెర్రరిస్టుల చేతిలోకి వెళ్లి ఎదుట దేశంపై విధ్వంసానికి కారణాలవుతున్నాయని వివరించారు. మాదగద్రవ్యాల వినియోగం రవాణాపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా 1972 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆశ్రమ హాస్పిటల్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ చేబ్రోలు, ఆశ్రమ హాస్పిటల్ సీఈవో హనుమంతరావు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ప్రభు కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువగా వినియోగించేది చదువుకున్న యువకులు కావడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్ బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించే యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని చెప్పారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ వైద్యులు ప్రాణాలను రక్షించడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని డ్రగ్స్ ను ఉపయోగిస్తారన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం వలన సమాజానికి చేటు కలుగుతుందని వివరిం చారు. ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఏలూరులో ఆశ్రమ హాస్పిటల్ లో విద్యా బోధనపై ఎటువంటి రిమార్కులు లేవన్నారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఆశ్రమ హాస్పిటల్ డైరెక్టర్ రతీ దేవి, ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఎక్సైజ్ సిఐ ధనరాజు, ఏలూరు స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శం సూరంపూడి జీవితం

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం: పాత్రికేయుడిగా, ఉపాధ్యాయుడిగా, నటుడిగా సూరంపూడి వెంకటరమణ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయన జీవితం సమాజానికి ఆదర్శనీయమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. తాడేపల్లిగూడెం జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ ఏపీయుడబ్ల్యూజే అనుబంధం ఆధ్వర్యంలో కీర్తిశేషులు సూరంపూడి వెంకట రమణ సంస్మరణ సభ బుధవారం జరిగింది. స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ప్రెసిడెంట్ తమ్మిశెట్టి రంగా సురేష్ నిర్వహణ ఏర్పాట్లలో జరిగిన ఈ సభకు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. ఐజెయు జాతీయ కార్యదర్శి డి. సోమ సుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు సుందరనీడి వెంకట లక్ష్మయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు బాసంశెట్టి బాల బాలాజీ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సహాయ కార్యదర్శి గారపాటి ప్రసాద్, తాడేపల్లిగూడెం ఎలక్ట్రానిక్ మీడియా పూర్వాధ్యక్షులు పాలడుగు సతీష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శీలి రాజు,ప్రెస్ క్లబ్ పూర్వాధ్యక్షులు చిట్యాల రాంబాబు,చిక్కాల రామకృష్ణ, అడపా మాణిక్యాలరావు, ప్రెస్ క్లబ్ పూర్వ కార్యదర్శి మైలవరపు రవికిరణ్, ఇంకా పలువురు జర్నలిస్టులు పాల్గొని సూరంపూడి వెంకటరమణ చిత్ర పటానికి పుష్పాంజలితో నివాళులర్పించారు. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఐ జే యు జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్ మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల పాటు సూరంపూడి వెంకటరమణ ఈనాడు విలేకరిగా విశేషమైన సేవలు అందించారని పేర్కొన్నారు. స్వతహాగా రంగస్థలం నటుడైన రమణ బుల్లితెర,వెండితెర

మీద పలు పాత్రలు పోషించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా ఆయన రాణించారన్నారు. జర్నలిస్టుగా, టీచరుగా, కళాకారుడుగా రమణ మాస్టారు బహుముఖ పాత్రలు పోషించారని కొనియాడారు. రమణ మాస్టర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడమే ఆయనకు మనం అర్పించే నివాళులని సోమసుందర్ సూచించారు. ఈ సభలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఎస్.వి లక్ష్మయ్య,సీనియర్ జర్నలిస్టులు తేతలి గంగాధర్ రెడ్డి, చిట్యాల రాంబాబు, ఏ.వీ.రామరాజు, చిక్కాల రామకృష్ణ, పాలడుగు సతీష్, కే.ఆశీర్వాదం, మైలవరపు రవి కిరణ్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజులు మాట్లాడారు. రమణ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రకటించారు. రమణ మాస్టారు మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సభలో జర్నలిస్టులు చింతకాయల దొరబాబు, చిట్రోజు కృష్ణ, ఐతం ప్రసాద్, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కొత్తపల్లి గోపీచంద్, ఎస్.రాంబాబు, కమల్, చందు తదితరులు పాల్గొని రమణ మాస్టారు ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. రాజమండ్రికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎం. శ్రీరామ్మూర్తి కుమార్తె తేజస్వి ఆకస్మిక మృతి పట్ల ఈ సభ సంతాపం వ్యక్తం చేసింది.

హెల్త్ సెంటర్ సమస్యలను పరిష్కరించి పరిస్థితిని మెరుగుపరుస్తా: సూపరింటెండెంట్

విశాలాంధ్ర బ్యూరో - తూర్పుగోదావరి : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఉన్న సమస్యలను పరిష్కరించి, పరిస్థితిని మెరుగుపడేలా కృషి చేస్తానని కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ ఇటీవల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌పై విశాలాంధ్ర పత్రికలో వచ్చిన వరుస కథనాలకు ఆయన వివరణ ఇచ్చారు. ఆస్పత్రిలో కొన్ని సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని వారం పది రోజుల్లో అడ్వైజరీ కమిటీ సమావేశం పెట్టి స్థానిక ఎమ్మెల్యే, కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పరిచి ఈ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. ఆస్పత్రిలో ఉన్న ముగ్గురు ఎంఎన్‌ఓలు పనిచేయటం లేదని, వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి చేయిస్తామన్నారు. ఇంకా డాక్టర్ల కొరత ఉందని నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయి పోస్టులు భర్తీ అయితే ఏ విధమైన సమస్య లేకుండా ఉంటుందన్నారు. ప్రసవం, మెడికల్ వార్డుల్లో డబ్బులు తీసుకున్నట్లు తెలియ వచ్చింది కానీ ఎవరూ కూడా తనకు రాత పూర్వకమైన ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. ఎవరైనా వచ్చి తమకు ఫిర్యాదు చేస్తే విచారించి డబ్బులు తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్సిజన్ పైపులు చోరీ విషయమై మాట్లాడుతూ అది తన హయాంలో జరగలేదని అప్పట్లో ఉన్న కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీపై చర్యలు జరుగుతున్నాయన్నారు. ఫ్యాన్‌లు, ఎసిలు పనిచేసేలా చూస్తామని, కొద్ది రోజుల్లోనే ఆసుపత్రి పరిస్థితిని చక్కదిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తానని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పీ-4 అమలులో జిల్లా రోల్‌మోడల్‌గా నిలవాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకులు గుర్తింపు,బంగారు కుటుంబాలు అనుసంధానం అంశంపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,యంపిడివోలు,పీ4 సర్వే విజన్ టీమ్ సభ్యులతో శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీ4, బంగారు కుటుంబాలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, అందుకు అనుగుణంగా సమన్వయంతో పనిచేసి విజయవంతం చెయ్యాలని అన్నారు. పీ4 కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో లాంఛనంగా ప్రారంభించియున్నారని, లక్ష్యాలు సాధించి రాష్ట్రానికే ఏలూరు జిల్లా రోల్ మోడల్‌గా నిలవాలని అన్నారు. జిల్లాలో 547 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి, శాసనసభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని అన్నారు. సర్వేలు జరపాలని అలాగే గ్రామ సభలు నిర్వహించి,పూర్తి వివరాలు యాప్‌లో అప్లోడు చేసి పూర్తి స్థాయి నివేదికలు జిల్లా కార్యాలయంకు పంపాలని అన్నారు.ఆగస్టు 15 నాటికి లక్ష్యాలను నూటికి నూరుశాతం పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలు అవసరాలను బట్టి వారికి చేయూతనివ్వడం ద్వారా సమాజంలో పేదవారు ఆర్థికంగా బలపడతారనే రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని మార్గదర్శులకు తెలియజేయ్యాలని అన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలకు చేయూత గాని, నైపుణ్యాభివృద్ధి గాని, పేద కుటుంబాలవారు ఏ విధంగా ఉన్నత స్థానానికి ఏదగగలరో సంబంధిత ఏ సహాయమైనా చేయవచ్చున్నారు. బంగారు కుటుంబాల దత్తత తీసుకున్న మార్గదర్శకులు వివరాలను సోషల్ మీడియాలో పొందుపరిస్తే వారిని గౌరవించుకున్న వారమవుతామని, మిగతావారికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. సిపివో సి.హెచ్.వాసుదేవరావు, జిల్లా పరిషత్తు సిఇవో యం.శ్రీహరి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, యంపిడివోలు, పీ4 సర్వే విజన్ టీమ్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - నిడమర్రు: గత ప్రభుత్వంలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిన ప్పటికి నేడు ఒక పక్కా గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ మరొక పక్కా ఇచ్చిన హామీల మేరకు సంక్షోభంలో కూడా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానిదేనని ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. బుధవారం నిడమర్రు మండలం భువనపల్లి గ్రామంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పత్సమట్ల" కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలతో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రజలతో మమేకమై ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలన గురించి వివరించి, స్థానికంగా ఉన్న సమస్యలు, అభ్యర్థనలు గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో నిర్మించిన జనసేన పార్టీ జెండా స్తూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, మండలాల అధ్యక్షులు, నాయ కులు, కార్యకర్తలు, వీర మహిళలు, తెలుగు మహిళలు, ప్రజా ప్రతి నిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్‌ని కలిసిన నాలి శ్రీను పేరుబోయిన దాము

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర యాదవ్‌ని మండల యాదవ సంఘం నాయకులు బుధవారం కలిశారు. జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం గుబ్బల మంగమ్మ ను దర్శించుకున్నారు. రాష్ట్రంలోని యాదవులంతా ఐక్యంగా ఉండి, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సూచించారు. యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సాల్వతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీను యాదవ్, టిడిపి మండల తెలుగు యువత కార్యదర్శి పేరు బోయిన దాము, మండల యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

విశాలాంధ్ర-పాలకోడేరు : పాలకోడేరు మండలం మోగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని గుత్తుల వారి పాలెం గ్రామానికి చెందిన కదలి జయలక్ష్మి భర్త సుమారు 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఆమెకు వివాహమైన కుమార్తె కూడా ఉంది.ఆమె అదే గ్రామానికి చెందిన దొంగ సుబ్బారావుతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంలో వారిద్దరూ గుట్టుచప్పుడు కాకుండా సహజీవనం సాగిస్తున్నారు. అయితే వారు అత్తిలిలో ఉన్నట్లు సుబ్బారావు భార్యకి సమాచారం అందడంతో ఆమె బంధువులను తీసుకొని బుధవారం తెల్లవారు జామున అత్తిలి వెళ్లగా వారిద్దరూ ఒక ఇంట్లో కనబడడంతో సుబ్బారావు భార్య ఆమె బంధువులు మూకుమ్మడిగా జయలక్ష్మి పై దాడి చేసి అక్కడి నుండి తమ స్వగ్రామమైన గుత్తుల వారి పాలెం తీసుకువచ్చి ఆమెను చెట్టుకు కట్టేసి మరల విచక్షణ రహితంగా దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఈ యొక్క వార్త సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో పాలకోడేరు పోలీసులు బుధవారం ఉదయాన్నే గ్రామంలోనికి వెళ్లి తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను విడిపించి చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ మహిళపై దాడికి పాల్పడిన దొంగ సుబ్బారావు భార్య, ఆమె బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

విశాలాంధ్ర-పాలకోడేరు : ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం పురస్క రించుకుని పాలకోడేరు మండలం మోగల్లు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మేధస్సు నైపుణ్యాన్ని పెంపొందించే క్విజ్, డ్రాయింగ్ రీల్ ప్లే మొదలగు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. వి. త్రినాధులు మాట్లాడుతూ విద్యార్థుల తమ భవిష్యత్తును బంగారు బాటగా చేసుకోవాలంటే చిన్నతనం నుండి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. తదనంతరం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ ట్రైనర్, ఆటోమేటిక్ ట్రైనర్ బాలరాజు, ఉపాధ్యాయులు కమల కుమారి, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం : వరి సాగుకు అవసరమైన సాగునీటిని శివారు భూములకు సైతం ఆటంకం లేని విధంగా సరఫరాకు జల వనరుల శాఖ అధి కారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగ రాణి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాల యం వశిష్ట సమావేశ మందిరంలో సాగునీటి సరఫరాపై ఇరిగేషన్, డ్రైన్స్, ఎర్రకాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగుకు నీటిఎద్దడి ఏర్పడకుండా శివారు భూములకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా ఇరిగేషన్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిరంతరాయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేని విధంగా తూడు, గుర్రపు డెక్క ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులును చూసి నిర్లక్ష్యం వహించవద్దని, వర్షాకాలంలో రెండు, మూడు మాసాలు అధిక వర్షాలు, వరదలు ఏ సమయంలోనైనా సంభవించే అవకాశం ఉందని, దీనికి తగినట్లుగా అన్ని విధాల ఇంజనీరింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టాలన్నారు. పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. తొలుత ఇరిగేషన్ కెనాల్స్, డ్రైన్స్ సాగునీటి పారుదల సిస్టం మ్యాపులను పరిశీలించి అధికారులకు తను సూచన చేశారు. జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, హెడ్ వాటర్ వర్క్స్ ఈ.ఈ జి.శ్రీనివాస్, ఇరిగేషన్, డ్రైన్స్, ఎర్ర కాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 165 భూసేకరణలో భాగంగా కాళ్ళ మండలం రైతులు అభ్యంతరాలు పరిష్కారం

- జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-కాళ్ళ: జాతీయ రహదారి 165 నిర్మాణం లో భాగంగా కాళ్ళ మండలం కొలనుపల్లి, సీసాలి, కోపల్లి, పెదమిరం, వేంపాడు, తదితర గ్రామాల రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం కాళ్ళ తాహసిల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. భూ సేకరణ పై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగిసేనాటికి వచ్చిన 54 అభ్యంతరాల పై ఈ రోజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్మెంట్ తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, తమ భూములు వ్యవసాయేతర భూములుగా మార్పు చెందినందున నష్టపరిహారం చదరపు గజాలలో లెక్కించి ఇవ్వాలని రైతులు కోరగా వ్యవసాయేతర భూములుగా మార్చిన ధ్రువపత్రాలను దాఖలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, తాహసిల్దార్ సుందర్ సింగ్, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ సి హెచ్ రవికుమార్, డీ.టీ కళ్యాణి, సంబంధిత గ్రామాల వీఆర్వోలు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు కోసం సొసైటీలు పనిచేయాలి

విశాలాంధ్ర-నిడమర్రు:ప్రాథమిక విశాల సహకార సంఘాలు సొసైటీలు అభివృద్ధికి త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ సభ్యులు కృషి చేయాలని ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నిడమర్రు మండలం పెదనిండ్రకొలను ది.విశాల సహకార సంఘం (సొసైటీ) ఛైర్మన్‌గా కందుల పాటి సత్య నారాయణ, త్రిసభ్య కమిటీ సభ్యులైన బద్దిరెడ్డి శ్రీనివాస్, అల్లూరి శివ రామ గోపాల కృష్ణంరాజు ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఎమ్మెల్యే ధర్మరాజు ఛైర్మెన్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఏఎంసి ఛైర్మెన్, ఎన్ డి ఏ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను వైసీపీ కార్యాలయంలో నాయకులు, అభిమానులు నిర్వహించారు. కార్యాలయంలో బర్తడే కేకును కట్ చేసి ఎంపీపీకి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ మాట్లా డుతూ ఎవరికి ఏ కష్టం వచ్చినా సహృదయంతో ఆదుకుని వైసీపీ కార్యకర్తలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఘంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, ఈడే వెంకటేశ్వరరావు, సాక్షి సాయి, దివి సతీష్, కూనపురెడ్డి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించారు.

కలెక్టర్‌కు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: ఉద్యోగ బాధ్యత వృత్తి ధర్మాన్ని పాటిస్తే ప్రజా మన్నన అవార్డులు పొంద గలుగుతామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) అవార్డు అందుకున్న కలెక్టర్ నాగరాణిను పెద అమిరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, వెంకటేశ్వర స్వామి దేవస్థాన అధ్యక్షులు కంతేటి వెంకటరాజులు అభినందించి సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 7 ఉత్పత్తుల్లో జిల్లాలోని నరసాపురం క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్ కు ఓడిఓపి అవార్డు లభించడం గొప్ప విశేషమని వారు అన్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 8 జౌళి చేతి ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లేసుకు భౌగోళిక సూచిక గుర్తింపు లభించిందని, అంతర్జాతీయ వర్క్ షాప్ లో జిల్లా కలెక్టర్ నాగరాణి పాల్గొని నరసపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చేతులు మీదుగా (జిఐ) సర్టిఫికేట్‌ను అందుకోవడం అభినందనీయమని మరిన్ని అవార్డులు కలెక్టర్‌కు సొంతం కావాలని ఆకాంక్షించారు.

ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం 2025-థీమ్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 2025 ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ దినోత్సవం (2014 నుండి) 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఈ 2025 థీమ్ మరియు డిజిటల్ నైపుణ్యాల ద్వారా యువత సాధికారత". డిజిటల్ ప్రపంచంలో ఉద్యోగాలు మరియు వ్యవస్థాపకత కోసం యువతను సిద్ధం చేయడంపై ఈ దినోత్సవం దృష్టి పెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డా ఎస్ రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డా రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి సురేష్, గ్రంధాలయ అధికారి కె అశోక్ కుమార్, వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం విజ్ఞాదాయకంగా సాగిందని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

స్త్రీలకు, పసిపిల్లల పౌష్టిక ఆహారంలో పురుగులు

విశాలాంధ్ర-గండేపల్లి : జగ్గంపేట నియోజకవర్గం లోని అంగన్వాడీ కేంద్రాల వద్ద పురుగులు పట్టిన గుడ్లు దర్శనం ఇస్తున్నాయి. పసిపిల్లలు, గర్భిణీ స్త్రీలకు వారి పోషణ నిమిత్తం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి వారికి గుడ్లను పంపిణీ చేస్తుంటారు. అయితే కాసులు కక్కుర్తి కోసం పిల్లలకు ఇచ్చే గుడ్లలో పురుగులు పెట్టిన నిల్వ గుడ్లను, సరి అయిన పరిమాణం లేని గుడ్లను కొంతమంది అక్రమార్కులు అంగన్వాడీ కేంద్రాలకు తరలిస్తున్నారు. గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామం లోని అంగన్వాడీ 1 కేంద్రం వద్ద పురుగులు పెట్టిన గుడ్లు దర్శనమిచ్చాయి. నియోజకవర్గంలోని పలు కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గత ప్రభుత్వంలో కాంట్రాక్టు దారుడు అంగన్వాడీ గుడ్లు పై, ఐసిడిసి, ముద్ర వేసి అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. అనేక సార్లు నిలవ గుడ్లను పంపిణీ చేసారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ సమస్య పై ఐసిడిఎస్ అధికారి సిడిపిఓ పూర్ణిమను వివరణ కోరగా కాంట్రాక్టు దారునికి గుడ్ల పై స్టాంప్‌లు ఉండాలే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.